సాక్షి ఖమ్మం

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



నూతన శకం...

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులు పగ్గాలు చేపట్టనున్నారు. IIలో



..గంజాయి స్వాధీనం

వైరా మీదుగా తరలిస్తున్న రూ.2లక్షల విలువైన గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
33° / 20°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, రాత్రి చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్న ఉష్ణోగ్రతలు మాత్రం పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్



ప్రాక్టికల్ రికార్డులు పరిశీలిస్తున్న డీఐఈఓ

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఉదయం 40 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 2,580మందికి గాను 2,315మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం 40 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1,804మందిలో 1,694 హాజరయ్యారు. కాగా, పరీక్షల నిర్వహణ తీరును పలు కేంద్రాల్లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తనిఖీ చేశారు. అంతేకాక హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కూడా తనిఖీ చేశాయని డీఐఈఓ తెలిపారు.

నేడు పాలేరుకు చేరనున్న సాగర్ జలాలు

కూసుమంచి: ఖమ్మం జిల్లాతో పాటు పొరుగున ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని పలు ప్రాంతాల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గాను సాగర్ నుంచి విడుదల చేసిన జలాలు పాలేరు రిజర్వాయర్‌కు శుక్రవారం సాయంత్రం చేరుకోనున్నాయి. సాగర్ నుంచి బుధవారం నీటిని విడుదల చేసిన విషయం విదితమే. సాగర్ నుండి ఎడమ కాల్వకు 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా తొలుత పాలేరుకు 2,500 క్యూసెక్కుల నీరు చేరి.. క్రమంగా 4,500 క్యూసెక్కులకు పెరుగుతుందని అధికారులు తెలిపారు. కాగా, గురువారం నాటికి రిజర్వాయర్ నీటిమట్టం 10.80 అడుగులకు పడిపోయింది. సాగర్ నుంచి వచ్చేనీటితో రిజర్వాయర్‌ను పూర్తిస్థాయి నీటిమట్టమైన 23 అడుగులకు నింపి తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు.

ఎస్సెస్సీ ఫలితాల పెంపుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, పక్కన డీఈఓ శర్మ

ఖమ్మం సహకారనగర్: వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఎంఈఓలు, హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మతో కలిసి పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై సమీక్షించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తూ, తరచుగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఆయా పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చేవారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత ఉత్తీర్ణత నమోదయ్యేలా ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ సూచించారు.

గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కామేపల్లిలో విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న డీడీ విజయలక్ష్మి

కామేపల్లి/కారేపల్లి: ప్రభుత్వ గిరిజన పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. కామేపల్లి మండలం టేకులతండా గిరిజన ప్రాథమిక పాఠశాల, కామేపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలోని బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా బోధన, పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన డీడీ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడమే కాక పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. హెచ్‌ఎం నామానాయక్, ఉపాధ్యాయులు సపావట్ కిషన్, భారతి, ప్రమీల, దేవి, వసంత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని ఆశలు

కొత్తదనం ఏమీ లేదు



ఈ బడ్జెట్‌లో కొత్తదనం లేకపోగా, పాత విధానాలనే కొనసాగించారు. పన్నులకు సంబంధించి స్లాబ్‌లపై స్పష్టత ఇవ్వలేదు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ట్యాక్స్ పరిమితి పెంచితే బాగుండేది. వ్యాపారులకు ఇది ప్రయోజనకరమైన బడ్జెట్ కాదు.

– చిన్ని కృష్ణారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, ఖమ్మం

ఉద్యోగులకు ఊరట ఏదీ?



కేంద్రం కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించింది. ఉద్యోగులు, పేద, మధ్య తరగతి వర్గాల కోసం పెట్రోల్, డీజిల్, నిత్యావసరాలపై పన్నులు తగ్గిస్తే బాగుండేది. సబ్‌కా వికాస్‌లో ఇంకా రాయితీలు ఇవ్వాల్సి ఉంది. బడ్జెట్ కొందరికి మోదం.. ఇంకొందరికి ఖేదంగా ఉంది.


– ఎస్.వెంకన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కాలేజీ, ఖమ్మం

మోదీ వీడ్కోలు బడ్జెట్



కేంద్ర బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉంది. అంకెల గారడీతో మాయ చేసేందుకు యత్నించారు. ఇది రానున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి వీడ్కోలు పలకడం ఖాయం. వ్యవసాయ, సేవ, విద్య, వైద్య, రవాణా, ఉద్యోగ, కార్మికులను విస్మరించడం సరికాదు.

– ఆవుల అశోక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా



కేంద్ర బడ్జెట్‌లో రిక్తహస్తమే

- రైళ్ల హాల్టింగ్‌కూ రాని గ్రీన్‌సిగ్నల్
- జిల్లాకు ప్రత్యేకంగా ఒరిగింది శూన్యం
- మహిళల ప్రయోజనాలకు మాత్రం పెద్దపీటపై హర్షం
- ఆదాయ పన్ను స్లాబ్ పెంచకపోవడంతో ఉద్యోగుల్లో నిరాశ

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసింది. ఇక రైల్వే బడ్జెట్ లోనూ జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు కలిగేలా నిర్ణయాలు లేవు. గత కొన్నేళ్లుగా మధిర, ఖమ్మం స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని చేస్తున్న డిమాండ్‌కు స్పందన కరువైంది. మరోవైపు వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు ఎంతగానో ఎదురు చూసిన పన్ను రేట్ల సవరణ కూడా జరగలేదు. అయితే, మహిళల ఆరోగ్యం, ఇతర అంశాల్లో కేంద్రం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని మహిళలకు లబ్ధి చేకూరనుంది. మొత్తంగా చూసుకుంటే ఈ బడ్జెట్ జిల్లా ప్రజలను నిరాశకు గురిచేసిందనే చెప్పాలి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఆదాయపు పన్నుపై నిరాశ..

వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సంబంధించి స్లాబ్ పెంచకపోవడంతో నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం రూ.7లక్షల వరకు సంపాదించే వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోగా.. దీన్ని రూ.8 లక్షలకు పెంచుతారనే భావన వ్యక్తమైంది. కానీ యధాతథ స్థితిని కొనసాగించడం జిల్లాలోని లక్ష మంది పన్ను చెల్లింపుదారుల్లో అసంతృప్తిని కలిగించింది. కాగా, జిల్లాలో ఆదాయపు పన్ను చెల్లించే వారిలో 12 వేల మంది వ్యాపారులు, మరో 88 వేల మంది ఉద్యోగులు, ఇతరులు ఉన్నారు. వీరి ద్వారా దాదాపు రూ.200 కోట్లు ప్రభుత్వానికి వెళ్తోంది.

300 యూనిట్ల ఉచిత విద్యుత్

సామాన్యులపై విద్యుత్ బిల్లుల భారం పడకుండా కేంద్రం బడ్జెట్‌లో నూతన పథకాన్ని ప్రకటించింది. అర్హులైన లబ్ధిదారులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీమ్ తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. జిల్లాలోని 4,28,315 మంది విద్యుత్ వినియోగదారుల్లో దాదాపు 90 శాతం మంది 300 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. వీరందరికీ ఈ పథకం ఆసరాగా నిలవనుంది. అయితే, ఇళ్లపై సోలార్ యూనిట్లు బిగించే క్రమంలో నిబంధనల మేరకు ఎందరికి లబ్ధి జరుగుతుందనేది తేలాల్సి ఉంది.

మహిళలకు పెద్దపీట

కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతతో జిల్లాలోని మహిళలకు ప్రయోజనం చేకూరనుంది. 'లక్షపతి దీదీ' పథకం ద్వారా ప్రయోజనం పొందే మహిళల సంఖ్య పెంచడంతో ఆర్థిక స్వావలంబన లభించనుంది. ఈ పథకం ద్వారా మహిళలకు ఉపాధి రంగాల్లో శిక్షణ ఇస్తారు. అలాగే, బాలికలకు గర్భాశయ ముఖద్వార కేన్సర్ వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తుందని చెప్పడంపై హర్షం వ్యక్తమవుతోంది. అంతేకాక ఆయుష్మాన్ భారత్ పథకంలో అంగన్‌వాడీ, ఆశావర్కర్లను చేరుస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని 1,345 మంది ఆశావర్కర్లు, 1,742 మంది అంగన్‌వాడీ వర్కర్లకు లబ్ధి జరగనుంది. ఇంకా ఇంటి కొనుగోలు, సొంతింటి నిర్మాణం కోసం పథకాన్ని తీసుకొచ్చింది. అలాగే పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ప్రకటించడంతో కల నెరవేరుతుందని పేదలు భావిస్తున్నారు.

రైల్వేలపై కనికరించని మంత్రి

జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర మంత్రి ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇక ఖమ్మం, మధిర రైల్వేస్టేషన్లలో పలు రైళ్ల నిలుపుదల కోసం కొన్నేళ్లుగా ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నా సానుకూల ఫలితం రాలేదు. ప్రతిరోజు ఖమ్మంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైలు ప్రయాణాలు చేసే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. దీంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లే వారు అటు వరంగల్ లేదా ఇటు విజయవాడ వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితులున్నాయి. న్యూఢిల్లీ– తిరువనంతపురం మధ్య నడిచే కేరళ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ నుంచి త్రివేండ్రం వెళ్లే త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్, చెన్నై–జైపూర్ మధ్య నడిచే జైపూర్ ఎక్స్‌ప్రెస్, చెన్నై–డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఆపాలని ప్రయాణికులు కోరుతున్నా స్పందించకపోవడం గమనార్హం. అయితే, రాబోయే రోజుల్లో వందేభారత్, నమోభారత్ పేరుతో కొత్త రైళ్లను పెద్దసంఖ్యలో ప్రవేశపెడతామని ప్రకటించడంతో వీటికైనా హాల్టింగ్ ఇస్తారని ఆశిస్తున్నారు.

పూర్తి నిరాశ, నిస్పృహతో కూడిన బడ్జెట్



ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి నిరాశ, నిస్పృహతో కూడి ఉంది. బడ్జెట్ ప్రసంగం రాజకీయ ప్రసంగాన్ని తలపించింది. ఏ వర్గాన్ని సంతృప్తి పర్చకపోగా... ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకాన్నికూడా ప్రస్తావించలేదు.

– నామ నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ

కార్పొరేట్లకే అనుకూలం



బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా.. సామాన్యులకు వ్యతిరేకంగా ఉంది. 65 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకాలు ప్రకటించలేదు. ఎన్నికల వేళ పేద, మధ్యతరగతికి స్వాంతన జరుగుతుందని భావిస్తే నిరాశే ఎదురైంది.

– పోటు ప్రసాద్, జిల్లా కార్యదర్శి, సీపీఐ

పేదల అభివృద్ధికి తోడ్పాటునిచ్చేలా..



వికసిత్ భారత్ పేరుతో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, మహిళలు, యువత, వ్యాపార రంగాల అభివృద్ధికి తోడ్పాటు అందించేలా ఉంది. ఆశావర్కర్లు, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ యోజనను వర్తింపజేయడం ఆనందంగా ఉంది.

– గల్లా సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఇంద్రవెల్లిలో మరో రెండు గ్యారంటీల ప్రకటన



ప్రజాపంథా కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

- మా ప్రభుత్వం ప్రజల పక్షాన పని చేస్తుంది..
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మంఅర్బన్: ఎన్నికలకు ముందు తాము ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మరో రెండింటి అమలుపై శుక్రవారం జరిగే ఇంద్రవెల్లి సభలో ప్రకటన చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇది ప్రజల పక్షాన పని చేసే ప్రభుత్వమని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నుంచి తన గెలుపు, కాంగ్రెస్ విజయాన్ని కాంక్షిస్తూ మద్దతు ఇవ్వడంపై మంత్రి గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ, టీడీపీ జిల్లా కార్యాలయాలకు వెళ్లారు. ప్రజాపంథా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీపీఐ కార్యాలయంలో బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యాలయాల్లో జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వాన్ని అందరి సహకారంతో గద్దె దించి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. తన విజయానికి సహకరించిన వారు అసెంబ్లీ ఎన్నికల వరకే పరిమితం కాకుండా భవిష్యత్‌లోనూ కలిసి పనిచేయాలన్నారు. కాగా, టీడీపీ కార్యాలయంలో దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పొంగులేటి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాపంథా, సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు గుర్రం అచ్చయ్య, జి.రామయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, వి.మనోహర్ రాజు, పుసులూరి నరేంద్ర, సీవై.పుల్లయ్య, ఆవుల అశోక్, దండి సురేష్, మౌలానా, జానీమియా, రాయల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య, ఎండీ.జావేద్, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, తుంబూరు దయాకర్‌రెడ్డి, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, కొండబాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి పొంగులేటి నగరంలోని కాంగ్రెస్ నాయకుడు రాయల నాగేశ్వరరావు ఇంటికి కూడావెళ్లి గత ఎన్నికల్లో తన విజయానికి సహకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

జేఎల్‌ఎంల ఎంపిక ప్రక్రియ పూర్తి

- ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది అభ్యర్థుల హాజరు
- సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహణ



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు



స్తంభం ఎక్కుతున్న జేఎల్‌ఎం అభ్యర్థి

ఖమ్మంవ్యవసాయం: జూనియర్ లైన్‌మెన్ల మూడో దశ ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు గురువారం ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో పరీక్ష నిర్వహించారు. 2019వ సంవత్సరంలో జూనియర్ లైన్‌మెన్ల పోస్టులకు రాతపరీక్ష నిర్వహించగా మూడో దశలో 23 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరి సర్టిఫికెట్లను గురువారం పరిశీలించి స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించిన 23 మందిలో 20మంది హాజరుకాగా, కొందరు మాత్రమే స్తంభం ఎక్కే పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్ష పరిశీలకుడిగా వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఈ అశోక్ వ్యవహరించగా ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్, డీఈలు బాబూరావు, నాగేశ్వరరావు, జిలానీపాషా తదితరులు పర్యవేక్షించారు. కాగా, పరీక్ష నిర్వహిస్తుండగా ఆన్‌లైన్ విధానంలో హనుమకొండ నుంచి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. కాగా, అభ్యర్థుల వివరాలు సీఎండీ పరిశీలన అనంతరం అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది.

నేటి నుంచి బియ్యం పంపిణీ

ఖమ్మం సహకారనగర్: పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన రేషన్ కార్డుదారులకు శుక్రవారం నుంచి బియ్యం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు గురువారం ఆదేశాలు అందాయి. దీంతో రేషన్‌షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేసేలా అధికార యంత్రాంగం డీలర్లకు సూచనలు చేసింది.

మేడారం జాతరపై ఆర్టీసీ ఈడీ సమీక్ష



కొత్త బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఈడీ

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) రఘునాథరావు గురువారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా మేడారం జాతరకు నడపాల్సిన ప్రత్యేక బస్సులపై రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో సమీక్షించి సూచనలు చేశారు. అనంతరం ఖమ్మంలో పాత, కొత్త బస్టాండ్లను ఆయన పరిశీలించారు.

బీఆర్‌ఎస్ భేటీలు..



- రేపు జిల్లాకు హరీశ్‌రావు, 4న కేటీఆర్
- 3వ తేదీన భద్రాచలం, మణుగూరులో సమీక్ష
- ఆతర్వాత రోజు వైరా, ఖమ్మంలో నేతలతో కేటీఆర్ సమావేశం
- పార్లమెంట్ ఎన్నికలకు దిశానిర్దేశం చేసేలా ప్రణాళిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్‌ఎస్ సమాయత్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భంగపాటుకు గురైన ఆ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాలను దక్కించుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈనేపథ్యాన 3, 4వ తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 3వ తేదీన జరిగే సమీక్షలకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, 4వ తేదీన జరిగే భేటీలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారు. ఈసందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశాల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తదితరులు పాల్గొంటారు.

గట్టెక్కేదెలా?

ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను బీఆర్‌ఎస్‌కు భద్రాచలం స్థానం మాత్రమే దక్కింది. 2014, 2018 ఎన్నికల్లోనూ ఒక్కో స్థానంతోనే సరిపెట్టుకున్నా.. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం స్థానాన్ని, ఉమ్మడి జిల్లా ప్రాతినిధ్యంతో మహబూబాబాద్ స్థానంలోనూ జెండా ఎగురవేసింది. దీంతో తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకుంటామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేసినప్పటికీ అలా జరగకపోగా రాష్ట్రంలోనూ అధికారంలోకి రాలేదు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో నెగ్గడం ఆ పార్టీకి కత్తి మీద సాములా మారిందని చెప్పొచ్చు. ఇటు మహబూబాబాద్ ఎంపీగా మాలోతు కవిత, ఖమ్మం ఎంపీగా నామ నాగేశ్వరరావు సిట్టింగ్‌గా ఉండటంతో ఆయా స్థానాల్లో మళ్లీ గట్టెక్కేదెలా అని ముఖ్యనేతలు ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా తెలంగాణ భవన్‌లో ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తూ పార్టీ శ్రేణులను లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు జిల్లాల బాట పడుతున్నారు.

భద్రాచలంలో మొదలు

మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భద్రాచలం, ఇల్లెందు, పినపాక, మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం మినహా మిగతా అన్నిచోట్లా కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఇక ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఉండగా అన్నిచోట్లా బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ వ్యత్యాసంతో ఓటమి పాలయ్యారు. ఈ ఓట్లను లెక్కలోకి తీసుకుంటే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆ పార్టీ విజయ తీరాలకు చేరడం కష్టమని రాజకీయంగా విశ్లేషణ జరుగుతోంది. అయితే గత ఎన్నికల్లో ఓటమికి దారితీసిన కారణాలు, పార్లమెంట్ ఎన్నికల్లో విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై నియోజకవర్గాల వారీగా ఇప్పటినుంచే రంగంలోకి దిగితే ఆశించిన ఫలితం వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఈనెల 3వ తేదీన శనివారం ఉదయం భద్రాచలంలో, మధ్యాహ్నం పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మణుగూరులో నిర్వహిస్తుండగా ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారు. ఇక 4వ తేదీన ఆదివారం ఉదయం వైరా, మధ్యాహ్నం ఖమ్మంలో జరిగే సమావేశాలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. కాగా, ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు మొదలయ్యే సమావేశానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, కేడర్ హాజరు కావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు. ఈ సమావేశాల తర్వాత ఉమ్మడి జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ దశల వారీగా భేటీలు జరుగుతాయని బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

ఆక్రమణలపై అదనపు కలెక్టర్ విచారణ

కారేపల్లి/కామేపల్లి: కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఆర్ అండ్ బీ రహదారికి ఇరువైపులా ఆక్రమణలపై అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం విచారణ చేపట్టారు. మండలంలోని విశ్వనాథపల్లిలో ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై ఇరువైపులా ఆక్రమణలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నందున స్వచ్ఛందంగా ఎవరికి వారే మార్కింగ్ మేరకుఅక్రమ నిర్మాణాలు తొలగించుకోవాలని సూచించారు. అలాగే, కామేపల్లి మండలం కొమ్మినేపల్లి, ముచ్చర్ల క్రాస్ రోడ్డు, లింగాల క్రాస్ రోడ్డులో రహదారిని ఆక్రమించిన దుకాణదారులతో మాట్లాడి తొలగించాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్‌తోపాటు వరప్రసాద్, నెహ్రూ, ధరావత్ మాన్‌సింగ్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



లయన్స్ సభ్యులు, ఉపాధ్యాయులతో డీఈఓ

వైరా: పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ ఈ. సోమశేఖరశర్మ సూచించారు. పల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ వైరా కార్యదర్శి అబ్బూరి రమేష్ సహకారంతో విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్, పండ్లు అందించే కార్యక్రమాన్ని గురువారం డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావుతో పాటు చింతోజు నాగేశ్వరరావు, సురేష్, రాము, హెచ్‌ఎం కె.సుజాతతో పాటు ఆర్.శ్రీనివాసరావు, అచ్యుత్, శివ, గుల్జార్‌బేగం, అజీమ్ పాల్గొన్నారు.

అవిశ్వాస నోటీసు పరిశీలన

కామేపల్లి: కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావుపై అవిశ్వాసం కోరుతూ 12 మంది డైరెక్టర్లు నోటీస్ అందించగా... గురువారం సొసైటీ కార్యాలయంలో డైరెక్టర్లతో వేంసూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.కిషోర్ సమావేశమై మాట్లాడారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లతో పాటు సీఈఓ గాదె నాగయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

ముదిగొండ: ముదిగొండ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని బెత్తంతో వాతలు తేలేలా దండించాడు. ఈవిషయం బుధవారం జరగగా గురువారం విద్యార్థి తల్లి, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. చివరకు సదరు ఉపాధ్యాయుడు క్షమాపణ కోరడంతో వివాదం సద్దుమణిగింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏన్కూరు: డాబా పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలో సూర్యతండాకు చెందిన ధరావత్ లాల్‌కోటి(35) జనవరి 26న తన ఇంటిపై డాబాపై నిద్రించాడు. అయితే, అర్ధరాత్రి మూత్రవిసర్జన దిగే క్రమంలో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

కామేపల్లి: ప్రేమ వివాహం చేసుకున్న యువతిని వేధిస్తున్న ఆమె భర్త, కుటుంబీకులు సహా నలుగురిపై బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఊట్కూర్‌కు చెందిన గుడిమెట్ల గోపీకృష్ణ అదే గ్రామానికి చెందిన ఈసం మౌనిక మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకే మౌనికను భర్తతో పాటు ఆయన తల్లిదండ్రులు నాగభూషణం, మంగతాయారు, అక్క ఝాన్సీ వేధిస్తూ అదనపు కట్నం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీంతో ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా మౌనిక తల్లి ఫిర్యాదుతో నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారుతో ఢీకొట్టి పరారు

పెనుబల్లి: మండలంలోని వీఎం బంజర్ రింగ్ సెంటర్ సమీపాన ఆగి ఉన్న కారును అదే మార్గంలో సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న మరో కారు ఢీకొట్టింది. దీంతో ఆగి ఉన్న కారులో కూర్చొన్న తన్నీరు శ్రీను, యర్రగొర్ల కవితకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కేఎం బంజర్, పార్థసారధీపురానికి చెందిన వీరు గురువారం కారులో వెళ్తూ వీఎం బంజర సెంటర్‌లో ఆగగా ప్రమాదం జరిగింది. ఘటనలో గాయపడిన శ్రీను, కవితను పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు.

భూఆక్రమణపై ఫిర్యాదు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో ముస్లింల ఈద్గా స్థలం ఆక్రమణకు గురైందంటూ పలువురు గురువారం తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 232లో ఈద్గాకు ఎకరం పది కుంటల భూమికి గాను ఆక్రమణకు గురైందని తెలిపారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,448

నూతన శకం ఆరంభం...

నేటి నుండి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన

- గెజిటెడ్ అధికారులకు 'పంచాయతీ'ల అప్పగింత
- జిల్లాలోని గ్రామపంచాయతీలు క్లస్టర్లుగా గుర్తింపు



తల్లాడ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలోని 589 గ్రామపంచాయతీలలో శుక్రవారం నుండి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌ల పదవీకాలం గురువారం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఎన్నికలు నిర్వహించే వరకు స్పెషల్ ఆఫీసర్ల పాలనకే మొగ్గుచూపింది. ఈ నేపథ్యాన జిల్లాలోని 589 జీపీలను క్లస్టర్లుగా విభజించి 178 మంది గెజిటెడ్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. కాగా, గ్రామాల్లో పాలకవర్గాల చివరిరోజు కావడంతో సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులను అధికారులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

అందరూ గెజిటెడ్ అధికారులే...

రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులుగా గెజిటెడ్ అధికారులను నియమించింది. తొలుత ప్రతీ జీపీకి ఒక్కో అధికారిని నియమించాలని భావించినా అధికారుల కొరతతో కేవలం గెజిటెట్ అధికారులనే నియమించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఐదు కేటగిరీల్లోని ఎంపీడీఓ, ఎంఆర్ఓ, ఎంఈఓ, అగ్రికల్చర్ ఆఫీసర్, మండల పంచాయతీ ఆఫీసర్లకు విధులు కేటాయించారు. ఈమేరకు పల్లెపాలనా బాధ్యతలు చేపట్టనున్న ప్రత్యేకాధికారులకు ప్రభుత్వం డిజిటల్ కీలను అందించనుంది. ఇప్పటికే సర్పంచ్‌ల నుండి డిజిటల్ కీలు, రికార్డులను స్వాధీనం చేసుకోగా శనివారం అధికారులకు అందజేస్తారు.

క్లస్టర్ల వారీగా బాధ్యతలు

జిల్లాలోని 589 జీపీలను 178 క్లస్టర్లుగా విభజించారు. ఆయా క్లస్టర్లకు 178మంది గెజిటెడ్ అధికారులకు కేటాయించారు. ఒక్కో క్లస్టర్‌లో ఉన్న జీపీల బాధ్యతలను ఆయా అధికారులు నిర్వర్తించాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారికి కలిపి జాయింట్ చెక్ పవర్ ఇవ్వనుండగా గ్రామాభివృద్ధి నిధులను ఇద్దరి సంతకాలతో డ్రా చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా పాలన



గ్రామాల్లో ప్రత్యేకాధికారుల ద్వారా శుక్రవారం నుండి పారదర్శకమైన పాలన అందిస్తాం. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో వారి నుండి రికార్డులు, డిజిటల్ కీలను స్వాధీనం చేసుకున్నాం. కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో పంచాయతీలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక అధికారులను నియమించాం. ప్రత్యేకాధికారితో పాటు గ్రామ కార్యదర్శికి వేర్వేరుగా నూతన డిజిటల్ కీలు అందజేస్తాం.

– హరికిషన్, జిల్లా పంచాయతీ అధికారి

డీ రిజర్వేషన్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: నూతన విద్యావిధానంలో డీ రిజర్వేషన్ పద్ధతి తీసుకురావాలని యూజీసీ యత్నిస్తుండడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ అన్నారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవనంలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే యత్నాలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో శాస్త్రీయ విద్యావిధానానికి తిలోదకాలు ఇచ్చి, విద్యను కాషాయీకరణ చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు ఉన్నా ఆర్థిక వెనుకబాటుతనం వల్ల ఆశించిన ప్రగతి సాధించలేకపోతున్నారన్నారు. ఈమేరకు మెరుగైన అవకాశాలు కల్పించాల్సింది పోయి డీ రిజర్వేషన్ తీసుకురావడం సరికాదని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు చందులాల్, రోహిత్, ప్రతాప్, రాజు, సునీల్, ప్రభాస్, నరేష్, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు డీసీసీబీ ఉపాధ్యక్షుడి రాజీనామా

మధిర: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు గురువారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మధిరలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ఈవిషయాన్ని వెల్లడించారు. కాగా, వెంకటేశ్వరరావు మధిర మండలం ఖమ్మంపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా, ఆయన సతీమణి రుక్మిణమ్మ ఖమ్మంపాడు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన గతంలోనూ మధిర ఆత్మ కమిటీ చైర్మన్‌గా, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షుడిగా, మధిర మండల పరిషత్ అధ్యక్షుడిగా పదవులు నిర్వర్తించారు. కాగా, దొండపాటికి మద్దతుగా మధిర మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సామినేని సురేష్, ఖమ్మంపాడు సొసైటీ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సీతారామయ్య, డైరెక్టర్లు సామినేని జానయ్య, కంచం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పిడికిటి సాంబశివరావు, ఖమ్మంపాడు గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు నూకారపు అప్పారావు, మర్సకట్ల శ్రీను కూడా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇసుక తరలిస్తున్న మూడు లారీలు సీజ్

డ్రైవర్లు, యజమానులపై కేసుల నమోదు



ముదిగొండలో పట్టుబడిన లారీలు, ట్రాక్టర్లు

బోనకల్/ముదిగొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నంబర్ ప్లేట్ లేని మూడు లారీలను పోలీసులు సీజ్ చేశారు. బోనకల్‌లోని మధిర క్రాస్ రోడ్డు వీటిని సీజ్ చేయగా, వివరాలను వైరా ఏసీపీ రహమాన్ గురువారం తెలిపారు. కొంతకాలంగా ఖమ్మంలోని ఇసుక మాఫియా బాధ్యులు ఏపీలోని ముఠాతో చేతులు కలిపి ఆంధ్రప్రదేశ్ ఇసుక క్వారీల నుంచి నిబంధనలకు విరుద్ధంగా బోనకల్ మీదుగా ఇసుక తరలిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా బిల్లులు లేకుండా నందిగామ రీచ్ నుంచి ఖమ్మంకు ఇసుక తరలిస్తుండగా మూడు లారీలను సీజ్ చేశామన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పట్టుబడకుండా, సీసీ కెమెరాలకు చిక్కకుండా యజమానుల సూచనల మేరకు నంబర్ ప్లేట్లు తొలగించినట్లు డ్రైవర్లు చెప్పడంతో యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని ఏసీపీ వెల్లడించారు. కాగా, నిందితుల్లో టేకులపల్లికి చెందిన బండి కొండలరావు, ఖమ్మం రోటరీనగర్‌కుచెందిన చెలమల్ల సుమంత్‌కుమార్, మహబూబాబాద్ జిల్లా పెరుమాండ్ల సంకీసకు చెందిన యర్ర మహేందర్, యర్ర సతీష్, కూసుమంచి మండలానికి చెందిన ఇరుగు సుదర్శన్ ఉన్నారని తెలిపారు. ఇక ముదిగొండ మండలం సువర్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద ఏపీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలు, మూడు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

రూ.2లక్షల విలువైన గంజాయి స్వాధీనం

వైరా: ఒడిశా నుంచి తీసుకొస్తున్న ఎనిమిది కేజీల గంజాయిని వైరా ఎక్సైజ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వైరా సీఐ రమ్యారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపాన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించారు. ఆయన వద్ద బ్యాగ్‌లో రూ.2లక్షల విలువైన సుమారు 8 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. సదరు వ్యక్తిని ఒడిషా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన కృష్ణ మండల్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఉద్యోగులు కిరీటి, మమత, రవి, సీతారాం, శ్రావణ్‌కుమార్, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మకందారులు అరెస్ట్

ఖమ్మంక్రైం: ఒడిశా నుంచి భారీగా గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్న నలుగురిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఖమ్మం శివార్లలో గురువారం ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ రాజు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా ఎన్ఎస్‌టీ రోడ్డుకు చెందిన గెంటేల నరేష్, జెడ్పీ సెంటర్‌కు చెందిన గుత్తికొండ యశ్వంత్, ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడుకు చెందిన దొడ్డ వీరప్రసాద్, తెల్దారుపల్లికి చెందిన భూక్యా వీరబాబు పట్టుబడ్డారు. వీరిని విచారించగా కేజీ రూ.5వేల చొప్పున గంజాయి తీసుకొచ్చి 50గ్రాములు, 100గ్రాముల ప్యాకెట్లుగా మార్చి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తున్నట్లు తేలింది. తనిఖీల్లో ఎస్సైలు షేక్ రబ్బానీ, లత, ఉద్యోగులు రామారావు, శశికాంత్, రమేష్, రవి, నరేష్, మారేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బావిలోకి దూసుకెళ్లిన కూలీల ఆటో

పలువురిని బయటకు తీసుకొచ్చిన రైతు



వ్యవసాయ బావిలో పడిన ఆటో

ముదిగొండ: మండలంలోని గంధసిరి సమీపాన వ్యవసాయ కూలీలతో వెళ్తున్న గురువారం సాయంత్రం అదుపు తప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. అయితే, ఎవరికీ ప్రాణాపాయం ఎదురుకాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.కోదాడ మండలం గోండ్రియాలకు చెందిన 16 మంది కూలీలు గంధసిరికి వచ్చి మిరపకాయలు కోశాక సాయంత్రం ఇంటికి బయలుదేరారు. అయితే, ఆటోలో కూలీలు కూర్చోగానే ఒక్కసారిగా బావిలోకి దూసుకెళ్లింది. దీంతో కూలీలు బావిలో పడగా కొందరు ఈదుతూ పైకి వచ్చారు. అనంతరం గంధసిరికి చెందిన రైతు ఫకీరు బావిలో దూకి మిగతా వారిని బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఒకరికి స్వల్పగాయాలు ఇతరులకు ఎలాంటి ప్రమాదం జరగలేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్ఐసీ వెబ్ అప్లికేషన్‌పై అవగాహన

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ఉద్యోగులు ఎన్ఐసీ వెబ్ అప్లికేషన్‌పై అవగాహన పెంచుకోవడం ద్వారా పనులు వేగంగా సాగుతాయని స్టేట్ ఇన్ఫర్మేటిక్స్ అడిషనల్ ఆఫీసర్ అధికారి ర్యానిల్ జాన్, సీనియర్ టెక్నికల్ డెరెక్టర్ రాకేష్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఉద్యోగులకు కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎన్ఐసీ ఐటీ మేనేజర్ విజయ్‌ప్రకాష్, జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి రాంప్రసాద్, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కిషన్‌రెడ్డితో పొంగులేటి, వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని జిల్లాకు చెందిన నాయకులు గురువారం ఢిల్లీ లో కలిశారు. మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ రాములుతో పాటు ఖమ్మంకు చెందిన డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు తదితరులు కిషన్‌రెడ్డిని కలిసి పలు అంశాలపై చర్చించారు. కాగా, వచ్చేఎన్నికల్లో ఖమ్మం లోక్సభ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని వెంకటేశ్వర్లు కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు, సొంత నిధులతో విద్యాలయం నడుపుతున్న విషయాన్ని కిషన్‌రెడ్డికి పొంగులేటి వివరించగా... పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

ఖమ్మంవ్యవసాయం: మార్కెట్లలోఎక్కడా ముష్టి విధానం అమల్లో లేదని, ఈ విషయాన్ని గుర్తించి కార్మికులు రైతులను ఇబ్బంది పెట్టే చర్యలు మానుకోవాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. మార్కెట్‌లో గురువారం ఆయన వివిధ విభాగాల కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కార్మికులు చేసే ప్రతీ పనికి రేట్లు నిర్ణయించగా, ఆ మేరకు రైతులు చెల్లిస్తున్నారని తెలిపారు. అంతేకాక దిగుమతి చార్జీల వంటివి కూడా రైతులే భరిస్తున్నందున వారిని వేధించొద్దని సూచించారు. మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శి బి.బజార్, వ్యాపారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు దిరిశాల వెంకటేశ్వర్లు, ఉప్పల్‌రావు, నున్నా మాధవరావు, యర్రా శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ గురువారం పరిశీలించారు. మండలంలోని కోరట్లగూడెం, చెన్నారం, నేలకొండపల్లి, పైనంపల్లి, నేలకొండపల్లిల్లో పర్యటించిన ఆయన పనులను పరిశీలించి మస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం పల్లె ప్రకృతి వనాలు, ఉపాధి నిధులతో నిర్మించిన గేదెలు, గొర్రెల షెడ్లను కూడా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటపతిరాజు, ఎంపీడీఓ కె.జమలారెడ్డితో పాటు సునీత, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

చేగొమ్మ సొసైటీ ఉద్యోగి తొలగింపు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ పీఏసీఎస్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాలబోయిన రమేష్‌ను విధుల నుండి తొలగిస్తూ జిల్లా సహకార అధికారి ఏ.విజయకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జీళ్లచెరువుకు చెందిన రమేష్ 2015లో రోజువారీ వేతనంపై చేరగా, 2019 ఎన్నికల్లో జీళ్లచెరువు నుండి 4వ వార్డుసభ్యుడిగా ఎన్నికయ్యాడు. అయితే, వార్డుసభ్యుడిగా కొనసాగుతూనే ఇటు ఉద్యోగం కూడా చేస్తున్నాడు. ఇంతలోనే ఏడాది క్రితం ఆయన ఉద్యోగం స్టాఫ్ అసిస్టెంట్‌గా రెగ్యులర్ అయింది. వార్డు సభ్యుడైన ఆయనను రెగ్యులరైజ్ చేయడంపై పలువురు ఫిర్యాదు చేయగా ఇటీవల అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామిరెడ్డి విచారణ చేపట్టారు. స్టాఫ్ అసిస్టెంట్ రమేష్ విధుల్లో నిర్లక్ష్యం వహించడమే కాక వార్డుసభ్యుడిగా పంచాయతీ సమావేశాలకు హాజరుకాలేదని తేలగా రమేష్‌ను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మట్టి తవ్వకాలపై ఆర్డీఓ విచారణ

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ భూముల్లో కొందరు అక్రమంగా మట్టి తవ్వి తరలించగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించగా.. ఖమ్మం ఆర్డీఓ గణేష్ గురువారం సైతం పరిశీలించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, తహసీల్దార్ సంపత్‌కుమార్‌తో కలిసి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. భారీగా మట్టి తవ్వినట్లు ఆనవాళ్లను గుర్తించిన ఆయన సమగ్రంగా సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు.

'ప్రజాపాలన' ఆపరేటర్లకు అందని నగదు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా పాలన సభల్లో భాగంగా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కంప్యూటర్ ఆపరేటర్లు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. గతనెల 6వ తేదీ వరకు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించగా.. కంప్యూటర్ ఆపరేటర్లతో దరఖాస్తుల్లోని సమాచారాన్ని ఆన్‌లైన్ చేయించారు. ప్రతీ దరఖాస్తు నమోదుకు రూ.10 వరకు చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఈమేరకు కేఎంసీ కార్యాలయంలో 100 మంది వరకు వివిధ శాఖల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై 81,211 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ఈ ప్రక్రియ గత నెల 17వ తేదీనే ముగిసినా ఇంత వరకు డబ్బులు చెల్లించకపోవడంతో ఆపరేటర్లు కేఎంసీ కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా అంతటా పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అధికారులను వివరణ కోరగా ప్రభుత్వం నుండి నిధులు రాగానే ఆపరేటర్లకు చెల్లిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి | ఉద్యమ కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

నేలకొండపల్లి: గత ప్రభుత్వ హయంలో విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని టీఎ స్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దుకు హామీ ఇచ్చినందున అమలుచేయాలని కోరారు. అలాగే, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ఉద్యోగులకు నూతన వేతన స్కేళ్లు అమలు చేయాలని, ఉపాధ్యాయుల పదోన్నతులు, అప్‌గ్రేడేషన్ పూర్తి చేయాలన్నారు. కాగా, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశాలు ఈనెల 4న నేలకొండపల్లిలో నిర్వహించనుండగా, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.నాగేశ్వరరావుతో పాటు రంజాన్, పి.సురేష్, షేక్ ఉద్దండు షరీఫ్, నవాబ్‌సాహెబ్, అయినాల గోవిందరావు, తొర్తి గురవయ్య, అరవింద్, ఎస్.నాగార్జున, విజయ్‌కుమార్, మంగేశ్వరి, కవిత, పద్మ పాల్గొన్నారు.

ఆవుల్లో పిండ మార్పిడి

ఖమ్మం జిల్లాలో మొదటిసారిగా అమలు



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

మధిరరూరల్: జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచేలా ఆవుల్లో పిండ మార్పిడి ప్రక్రియను ప్రారంభించినట్లు పీ.వీ.నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉదయ్‌కుమార్, పశు సంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వేణుమనోహర్ తెలిపారు. మధిర మండలం సిద్ధినిగూడెం, నాగవరప్పాడుల్లో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో పశువులకు గర్భకోశ చికిత్స చేయడంతో పాటు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అలాగే, పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమం, రాజశ్రీ పెరటి కోళ్లు పంపిణీ చేశారు. అనంతరం అధిక పాల ఉత్పత్తి కోసం ఆవుల నుంచి అండాలు, ఆంబోతుల నుంచి సేకరించిన సేకరించిన వీర్యకణాలను ప్రయోగశాలలో ఫలదీకరించాక తక్కువ పాల ఉత్పత్తి కలిగిన ఆవుల గర్భంలో ప్రవేశపెట్టే ప్రక్రియను సిద్ధినేనిగూడెంలో ఉదయ్‌కుమార్, వేణుమనోహర్ ప్రారంభించి మాట్లాడారు. అధికంగా పాలు ఇచ్చే దూడలను సృష్టించేలా పిండ మార్పిడి విధానాన్ని జిల్లాలో మొదటిసారిగా నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ లలిత, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, మండల పశువైద్యాధికారి కృష్ణారెడ్డి, ఉద్యోగులు రఫీ, అహ్మద్, లక్ష్మణరావు, కొండలరావు, రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

'ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్..'

ఖమ్మం సహకారనగర్: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను స్లాబ్‌ల్లో ఎలాంటి మార్పు చేయకపోవడంతో వేతనాలపై ఆధారపడి జీవించే ఉద్యోగ, ఉపాధ్యాయులు సరాసరి రెండు నెలల వేతనాన్ని పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. అలాగే, విద్యారంగానికి నామమాత్రంగా కేటాయింపులు జరిపారని, కొఠారి కమీషన్ చెప్పినట్లుగా ఆరు శాతం విద్యారంగానికి కేటాయింపులు జరపాలని వారు డిమాండ్ చేశారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.



క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రిసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీవీపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.


హార్ట్లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్లీ, రేహాన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాత ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్‌గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.


రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ


● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

చలో రష్యా

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.



● కమల్‌హాసన్

మహేశ్ సినిమాలో?

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.


● నాగార్జున

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తి శ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

సరికొత్త కథతో శ్రీకారం


● అమర్‌దీప్, సుప్రీత


'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ– ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

విన్నర్‌గా ఎలా మారాడు?


● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ–''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రాశ్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రాశ్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ


● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం - దేవ్ జాంద్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ– ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రొగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్‌ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.